సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష..
ఎయిడ్స్..నివారణ మార్గాలు తప్ప పూర్తిస్థాయి చికిత్స లేని వ్యాధి. ముందస్తు జాగ్రత్త తీసుకోవడమే నిండు జీవితానికి శ్రీరామరక్ష. - 8లో▸



రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత
భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి సమష్టి బాధ్యతని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/22^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. చల్లగాలులు విస్తాయి.

పెరగని పత్తి ధర

నిరాశలో రైతులు
- ఎగుమతి నిలిచిపోవడమే కారణం
- మద్దతు ధరకు సవాలక్ష కొర్రీలు

కాటారం: రెండేళ్లుగా అనేక నష్టాలు ఎదుర్కొంటూ సరైన దిగుబడి లేక అప్పులపాలవుతున్న పత్తి రైతుకు ఈ ఏడాది సైతం ఆశించిన స్థాయిలో శ్రమకు తగిన ఫలితం దక్కే పరిస్థితి లేదు. ఎంతో ఆశతో సాగు చేసిన తెల్లబంగారం రైతు ఆశలను వమ్ము చేస్తోంది. పత్తి దిగుబడి మెరుగ్గా ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధర పలుకుతుండడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. రెండేళ్ల కిందట బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర రూ.10వేలు వరకు పెరిగిపోయింది. గత ఏడాది అంత పెద్ద మొత్తంలో పత్తి ధర లేదు. ఈ ఏడాది సైతం మెరుగైన ధర లభిస్తుందని ఆశపడిన రైతన్నలు భంగపడ్డారు. ప్రైవేట్, ప్రభుత్వపరంగా గత నెల రోజులుగా పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నప్పటికీ ధర మాత్రం ముందుకుసాగడం లేదు. దీంతో రైతులు తమ పత్తిని విక్రయించాలా.. లేక నిల్వ చేసుకొని ఉంచుకోవాలా.. అనే సంశయంలో ఉన్నారు.

నెల రోజులుగా కొనుగోళ్లు..
జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో ప్రభుత్వ పరంగా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,521 చెల్లిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముందు ప్రైవేట్ పత్తి వ్యాపారులు రూ.7,300 వరకు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేశారు. రైతులు మొదట్లో సీసీఐ వైపు ఆసక్తి చూపగా కొనుగోళ్లు జోరుగా సాగాయి. కానీ సీసీఐ అధికారులు తేమ, నాణ్యత లేమి పేరిట కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేయడంతో ప్రైవేటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులకు కలిసి వచ్చింది. దీంతో రైతుల అమాయకత్వం, అవకాశాన్ని ఆసరగా చేసుకున్న ప్రైవేట్ వ్యాపారులు ధరను భారీగా తగ్గించారు. తేమ సాకును చూపిస్తూ వ్యాపారులు క్వింటాకు రూ.6,600 చెల్లిస్తుండగా, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు ప్రైవేట్‌గా రూ.6,500లకు కొనుగోలు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు.

నిలిచిన ఎగుమతులు..
భారత్‌లో సాగైన పత్తి ప్రతి ఏటా అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఎగుమతి చేయబడుతుంది. పలు దేశాల అవసరాలకు అనుగుణంగా అక్కడి వ్యాపారులు పత్తిని దిగుమతి చేసుకుంటారు. దేశాల డిమాండ్‌ను బట్టి పత్తి ధర నిర్ణయించబడుతుంది. గత ఏడాది అంతర్జాతీయంగా పత్తి అవసరం అంతంత మాత్రంగానే ఉండటంతో ధర సైతం మామూలుగానే ఉండిపోయింది. ఈ ఏడాదైనా పలు దేశాలకు పత్తి అవసరం అధికంగా ఉంటుందనుకున్న మార్కెట్‌దారుల అంచనా తలకిందులైంది. పలు దేశాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో పత్తి ఎగుమతులు పాక్షికంగా నిలిచిపోయాయి. దీంతో పత్తి ధర పెరిగే అవకాశాలు కనిపించడం లేదని సంబంధిత అధికారులు చెప్పుకొస్తున్నారు. పరిస్థితులు ఇలానే కొనసాగితే పత్తి ధర మరింత తగ్గే అవకాశాలు కూడా లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



పత్తి మిల్లులో నిల్వఉన్న పత్తి

పెరిగిన కొనుగోళ్లు..
జిల్లాలో పత్తి ఏరివేత జోరుగా సాగుతున్న నేపథ్యంలో పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పలు మండలాల్లో మినహా ఎక్కువగా రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయిస్తున్నారు. పత్తి ఏరివేత మొదటి దశలో ఉండడంతో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. దీంతో సీసీఐ ద్వారా రైతులు క్వింటాకు రూ.7,521 ధర పొందుతున్నారు. అంతే కాకుండా తేమ శాతం అతితక్కువగా ఉన్న పత్తిని సీసీఐకి విక్రయించిన రైతులు ప్రీమియం ఇన్సెంటివ్ కూడా పొందుతున్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర పెరిగితే రైతులకు లాభం చేకూరే అవకాశం ఉంది.

ఎగుమతులకు డిమాండ్ లేదు



అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ఎగుమతులకు డిమాండ్ లేదు. దీంతో పత్తి ధర పెరుగుదల నిలిచిపోయింది. మార్కెట్‌లో పత్తి బేల్ ధర, సీడ్ ధరను బట్టి పత్తి ధర హెచ్చుతగ్గులు ఉంటాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కుట్‌లో బేల్, సీడ్ ధర గతంతో పోల్చుకుంటే తగ్గిపోయాయి. మన దేశం నుంచి వివిధ దేశాలకు పత్తి ఎగుమతులకు డిమాండ్ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

- కనకశేఖర్, డీఎం, మార్కెటింగ్ శాఖ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఒడితల గ్రామంలో శనివారం విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం నైన్‌పాక గ్రామంలో నూతనంగా రూ.కోటి 10లక్షలతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల్లో ఐదింటిని అమలు చేసినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి.. ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 53వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లి గ్రామాల్లో కొంతమంది అక్రమంగా, దొంగతనంగా భూములు కొనుగోలు చేసుకున్నారని.. వారికి పట్టాలు ఇవ్వమని తెలిపారు.

పిచ్చిమాటలు మానుకోవాలి
బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు పిచ్చి కూతలు కూస్తున్నారని అలాంటివి మానుకోవాలని ఎమ్మెల్యే హితవుపలికారు. 'జాగ్రత్త బిడ్డా.. మా ప్రభుత్వం ఇచ్చిన మాట అమలు చేస్తుంది.. మీరు అనవసరమైన అభాండాలు వేస్తే ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో మీకు గుండు సున్న చూపించారు' అని అన్నారు. 'మేము తప్పు చేస్తే ప్రశ్నించండి.. మంచి సూచనలు ఇవ్వండి..' అని అన్నారు. 'మీలాగా శాంతినగర్, వెలిశాల గుట్టలను అక్రమించుకోము' అని అన్నారు. నిరుపేదల దగ్గర అక్రమంగా గుంజుకుని పట్టాచేసుకున్న భూములను పేదలకు పంచుతామని అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, విద్యుత్ అధికారులు ఎస్ఈ మల్సూర్ నాయక్, ఈఈ వెంకట్రామ్, డీఈలు పాపిరెడ్డి, సదానందం, ఏడీఈ సందీప్ పాటిల్, ఏఈ చంద్రశేఖర్, సమ్మయ్య, మధువంశీకృష్ణ, కిష్టయ్య, భాస్కర్, రత్నాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలుకేంద్రాలు ప్రారంభం
భూపాలపల్లి రూరల్: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర, సన్నాలకు క్వింటాకు రూ.500 మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, కాసీంపల్లి, జంగేడు, గుడాడుపల్లిలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

- పోస్టల్ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అజారుద్దిన్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అజారుద్దిన్

కాటారం: ప్రజలు తపాలాశాఖ సేవలను వినియోగించుకోవాలని తపాలాశాఖ మంథని డివిజన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజారుద్దిన్ అన్నారు. శంకరాంపల్లిలో తపాలాశాఖ సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటా తిరిగి తపాలా సేవలపై అవగాహన కల్పించారు. బేటీ బచావో బేటీ పడావో నినాదంతో కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా ప్రవేశపెట్టిన పథకం ఆడపిల్లలు కల్గిన కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరం అని అన్నారు. ఈ పథకం ద్వారా అధిక వడ్డీతో కూడిన చక్రవడ్డీ లభిస్తుందని తెలిపారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా ప్రయోజనం చేకూరుతుందని రూ.750 చెల్లించి పాలసీ తీసుకుంటే అధిక మొత్తంలో బీమా చెల్లింపు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది కుడుదుల కిష్టయ్య, తుల్సెగారి మల్లయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సాదా సీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం



భూపాలపల్లి రూరల్: మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదా జరిగింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో సభ్యులు పలు తీర్మానాలు ఆమోదించుకోవడంతోపాటు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. పట్టణంలో వార్డులవారీగా శానిటేషన్ పనులు ప్రతి రోజు చేయడంపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రమేశ్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సునీల్ కుమార్, అధికారులు మానస, అశోక్ కుమార్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలి



భూపాలపల్లి రూరల్: డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, ఆదివారం జరుగనున్న కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాలు విద్యుద్దీకరణ తదితర అంశాలపై శనివారం ఐడీఓసీ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన కూడళ్లను విద్యుద్దీపాలతో అలంకరించాలని తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు సుభాస్‌కాలనీలోని, సింగరేణి కమ్యూనిటీ హాలులో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో జరుగనున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. తొమ్మిది రోజుల్లో ప్రతిరోజు ఒక్కో శాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజు చేసిన కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్వరలో నాల్గో విడత రుణమాఫీ

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని 3,224 మంది రైతులకు త్వరలో నాల్గో విడత రుణమాఫీ రూ.31.28 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చేయనుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మూడు విడతలుగా రుణమాఫీ జరిగిందని మొదటి విడత 16,502 మంది రైతులకు రూ.93 కోట్ల 99 లక్షలు, రెండో విడత 9,839 మంది రైతులకు రూ.103 కోట్ల 87 లక్షలు, మూడో విడత 7670 మంది రైతులకు రూ.103 కోట్ల 08 లక్షలు రుణమాఫీ జరిగిందని తెలిపారు. ఇటీవల కాలంలో జరిగిన కుటుంబ నిర్ధారణలో జిల్లాలో 5,815 మంది రైతులకు 4,909 మంది రైతులు మాత్రమే కుటుంబ నిర్ధారణ చేసుకున్నారని, వీరిలో 3,224 మంది రైతులకు మాత్రమే రూ.31.28 కోట్లు రుణమాఫీ నాలుగో విడత చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

బ్యాంకుల్లో భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ కిరణ్‌ఖరే



బ్యాంకులో పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు బ్యాంకుల భద్రతా చర్యలను శనివారం ఆయన పరిశీలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో భద్రతపై జిల్లా పోలీసులు సైతం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకుల్లో దొంగతనాల నివారణకు, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. భద్రతా ప్రయోజనాల కోసం జిల్లాలోని అన్ని బ్యాంకులు సీసీ టీవీ కెమెరాలు కలిగి ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ, ప్రైవేట్ బ్యాంకు శాఖల్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో గుర్తించిన విషయాలతోపాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్, సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలు, లైటింగ్, లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు.

బ్యాంక్‌ను సందర్శించిన డీఎస్పీ
చిట్యాల: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌ను భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు శనివారం సందర్శించారు. విధి నిర్వహణలో భాగంగా బ్యాంక్‌లో సీసీ కెమెరాలు, బ్యాంక్‌లోని లాకర్ రూమ్‌లు భద్రంగా ఉన్నాయా.. లేదా.. అని పరిశీలించారు. అనంతరం బ్యాంక్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ మల్లేశ్, ఎస్సై శ్రవణ్‌కుమార్, బ్యాంక్ మేనేజర్ అంకిత్‌వర్మ తదితరులు ఉన్నారు.

'మహాలక్ష్మి'కి తప్పని నిరీక్షణ

- కాళేశ్వరంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



కాళేశ్వరం బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పేరుతో మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించింది. కార్తీక మాసం నేపథ్యంలో మహిళలు ఉచిత ప్రయాణంతో కాళేశ్వరాలయానికి భారీగా తరలివచ్చి దర్శనం చేసుకుని, పూజలో పాల్గొంటున్నారు. అయితే ఉదయం అడపాదడపా వచ్చిన బస్సులు సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత సరిపడా నడవకపోవడంతో ప్రయాణికులు ప్రధానంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వచ్చిన ఒకటి రెండు బస్సుల కోసం మహిళలు బస్టాండ్ బయటికి ఎదురు పరిగెత్తి సర్కస్‌ఫీట్లతో సీటు దొరకపట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్సులు సరిపడా లేకపోవడంతో చలిలోనే మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం వేచి ఉన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. ఆర్టీసీ యాజమాన్యం మాత్రం ఆరు గంటల తర్వాత బస్సు సర్వీసులను నడిపించడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక పురుషులు మాత్రం ఆ బస్సుల్లో ఎక్కలేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిపోతుండడం గమనార్హం.

చదువుకు 'పట్టా'భిషేకం

అంబరాన్నంటిన నిట్ 22వ స్నాతకోత్సవం



పట్టా అందుకున్న విద్యార్థి



పట్టా అందుకున్న కూతురుకు ముద్దుపెడుతున్న తల్లి



మాట్లాడుతున్న డీఆర్డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్



పట్టాలు అందుకున్న ఆనందోత్సాహంలో విద్యార్థులు

- పట్టాలందుకున్న 1,600 మంది విద్యార్థులు
- 11 గోల్డ్ మెడల్స్.. పది మంది విద్యార్థులు
- ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడు అవ్వాలి: నిట్ డైరెక్టర్
- హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన డీఆర్డీఓ చైర్మన్
- ఇన్‌స్టిట్యూట్, రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విన్నర్‌గా మంజిమా కర్మాకర్



డీఆర్డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ కామత్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న, రెండు గోల్డ్ మెడళ్ల విన్నర్ మంజిమా కర్మాకర్, చిత్రంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్: తెల్లటి కుర్తా పైజామా. మెడలో కండువా. తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు. అందరి ముఖాల్లో చిరునవ్వులు. వెరసి ఆకాశమే హద్దు అన్నట్లుగా వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. పట్టాలందుకున్న వేళ పట్టరాని ఆనందంతో ఎగిరి గంతేశారు నిట్ విద్యార్థులు. పిల్లల ఆనందాన్ని దగ్గరినుంచి చూసి ఉబ్బితబ్బిబైపోయారు తల్లిదండ్రులు. వరంగల్ నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శనివారం నిట్ 22వ స్నాతకోత్సవం అంబరాన్నంటింది. ఇనిస్టిట్యూట్‌లో విద్యనభ్యసించి ఉత్తీర్ణత సాధించిన బీటెక్, ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీకి చెందిన 1,875 మందికిగాను 1,600 మంది విద్యార్థులు తెల్లటి కుర్తా పైజామా, శారీ, కాన్వొకేషన్ కండువా డ్రెస్ కోడ్‌లో సందడి చేశారు. కాన్వొకేషన్‌కు ముఖ్యఅతిథిగా సెక్రటరీ డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్(ఆర్ అండ్ డీ) డీఆర్డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ 22వ స్నాతకోత్సవానికి ప్రారంభ ఉపన్యాసం చేసి విద్యాసంస్థ విశిష్టత తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

10 పడకల హెల్త్ సెంటర్ ప్రారంభం..
నిట్ వరంగల్ క్యాంపస్‌లో 10 పడకల ఎమర్జెన్సీ వార్డు, ల్యాబ్, ఫిజియోథెరపీ అండ్ ఫార్మసీ బ్లాక్‌లతో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్‌ను డీఆర్డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్ శనివారం ప్రారంభించారు.

పట్టాల కోసం క్యూ..
నిట్ 22వ స్నాతకోత్సవంలో 1,875 మంది విద్యార్థులు పట్టాలందుకోవాల్సి ఉండగా 1,600 మంది హాజరయ్యారు. ప్రతీ కాన్వొకేషన్‌ను ఆడిటోరియంలో ఏర్పాటు చేసే వారు, కానీ ఈసారి ఆడిటోరియం రినోవేషన్‌లో ఉండడంతో అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ ఆడిటోరియంలో కేవలం 460 మందికి సరిపోతుండడంతో పట్టాలు అందుకునేందుకు విద్యార్థులు క్యూలో నిలబడాల్సి వచ్చింది.

మంజిమా కర్మాకర్‌కు రెండు బంగారు పతకాలు
స్నాతకోత్సవంలో 11 రోల్ ఆఫ్ గోల్డ్ మెడల్స్‌ను పది మంది విద్యార్థులు అందుకున్నారు. ఇందులో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ గోల్డ్‌మెడల్, రోల్ ఆఫ్ హానర్ గోల్డ్‌మెడళ్లను మంజిమా కర్మాకర్ అందుకోగా, పీజీ, పీహెచ్‌డీలతోపాటు మిగతా 7 డిపార్ట్‌మెంట్‌లలో విద్యార్థులు అందుకున్నారు.

నా మొదటి బాస్ నిట్ విద్యార్థే
నేను పనిచేస్తున్న డీఆర్డీఓలో నా మొదటి బాస్ డాక్టర్ మానకొండయ్య నిట్ విద్యార్థే. ప్రపంచస్థాయిలో నిట్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. అలాంటి సంస్థలో చదవడం మీ అదృష్టం. దేశ నిర్మాణానికి పాటుపడాలి. 1958లో ఏర్పడిన డీఆర్డీఓ కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆర్‌అండ్‌డీ విభాగం. దేశంలోనే సాంకేతికంగా అగ్రస్థానంలో ఉన్నాం. ఇందులో చేరేందుకు నిట్ విద్యార్థులు ఆసక్తిని కనబర్చాలి. దేశభవిష్యత్ యువత చేతుల్లోనే ఉంది.

- డాక్టర్ సమీర్ వి.కామత్, డీఆర్డీఓ చైర్మన్

స్నాతకోత్సవం విద్యార్థుల స్వప్నం
విద్యార్థి జీవితంలో డిగ్రీ పట్టాను స్నాతకోత్సవంలో అందుకోవడం స్వప్నం. ప్రతీ విద్యార్థి ఉత్తమ పౌరుడిగా రాణించాలి. ప్రతీ ఏడాది బీటెక్, ఎంటెక్‌లకు మాత్రమే రోల్ ఆఫ్ హానర్స్ గోల్డ్‌మెడల్స్ అందజేస్తుండగా ఈ ఏడాది పరిశోధనలపై ఆసక్తిని పెంచేందుకు, గౌరవం కల్పించేందుకు పీహెచ్‌డీలో, అన్ని విభాగాల విద్యను ప్రోత్సహించేందుకు పీజీలో ఉత్తమ థీసిస్‌కు రోల్ ఆఫ్ హానర్ గోల్డెమెడల్‌ను ప్రారంభించాం. నిట్ వరంగల్ రూ.54.72 కోట్ల ప్రాజెక్టులు,4.19 కోట్ల కన్సల్టింగ్ గ్రాంట్‌లను సాధించింది. 300 కంపెనీలు ప్రతీ ఏడాది క్యాంపస్ సెలక్షన్స్‌లో మన విద్యార్థులను ఎంపిక చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఈ ఏడాది రూ.88లక్షల వార్షిక ప్యాకేజీతో ప్రతిభ చాటారు. నిట్ అల్యూమ్ని సహకారంతో రూ.2.3 కోట్ల ఎండోమెంట్‌ఫండ్‌ను సేకరించింది.

- బిద్యాధర్ సుబుదీ, నిట్ డైరెక్టర్

పెరిగిన కాళేశ్వరాలయ ఆదాయం

- కార్తీకమాసం ఆదాయం రూ.1.05 కోట్లు



సామూహిక దీపాలంకరణ నిర్వహిస్తున్న అర్చకులు

కాళేశ్వరం: కాళేశ్వరాలయంలో కార్తీకమాసం అత్యంత వైభవంగా జరిగింది. నవంబర్ 2 నుంచి ప్రారంభమైన కార్తీకమాసం (నేడు)ఆదివారంతో ముగియనుంది. కాగా, నేడు అమావాస్య కావడంతో భక్తుల సంఖ్య తగ్గనుందని పండితులు పేర్కొన్నారు. నెల రోజులపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి గోదావరి మాతకు పూజలు చేశారు. అనంతరం కాళేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, శ్రీశుభానంద దేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, బ్రాహ్మణోత్తములకు దీపదానాలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి లక్షవత్తులు వెలిగించడం, లక్ష ముగ్గులు వేయడం లక్షపత్రి పూజలు చేశారు. నదీహారతిని ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజు సామూహిక దీపాలంకణ, ప్రతి సోమవారం సహస్రదీపాలంకరణ చేపట్టారు. 29న శుక్రవారం 11,116 దీపాలు వెలిగించి మహా దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా మహిళలతో నిర్వహించారు. కార్తీకమాసంలో వీవీఐపీల సందడి కనిపించకపోవడం గమనార్హం. సెలవురోజుల్లో భక్తులతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ప్రతి రోజు నిత్యం వేల మంది భక్తులతో ఆలయాలన్ని కిటకిటలాడాయి. కాగా, ఈసారి మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సులతో వివిధ జిల్లాల నుంచి మహిళలు మునుపెన్నడూ లేనంతగా తరలివచ్చారు. వివిధ పూజలు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.05 కోట్లు (కోటీ ఐదు లక్షల) ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాల ద్వారా తెలిసింది. గతేదాడి కార్తీక మాసంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రూ.67.10లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో ఉంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

భూపాలపల్లి అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ తెలిపారు. శనివారం భూపాలపల్లి జీఎం ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమానికి జనక్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తి, ఉత్పాదకత, కార్మికుల సంక్షేమానికి యాజమాన్యంతోపాటు కార్మిక సంఘాల నాయకులు కలిసి పని చేయాలన్నారు. కార్మికులు, కార్యకర్తల కృషి ఫలితంగా ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి ఏరియాలో గెలిచిందన్నారు. కార్మికుల కోసం పని చేసే ప్రభుత్వం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి అభ్యున్నతి, కార్మికుల సంక్షేమానికి పని చేసే వారని అన్నారు. మధుకర్ రెడ్డి, బుచ్చయ్య, రాజేందర్, నరసింహా రెడ్డి, శంకర్ రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో స్టాఫ్‌నర్సు మృతి

- మృతదేహంతో ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన



అప్సర(ఫైల్)

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి స్టాఫ్‌నర్సు శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల కథనం ప్రకారం.. భూపాలపల్లిలోని టీటూ క్వార్టర్స్‌కు చెందిన ఎస్‌కే అప్సర (28) కొన్నేళ్ల క్రితం భర్తతో విడిపోయి తల్లిదండ్రులు వద్ద ఉంటోంది. జీవనోపాధి నిమిత్తం పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న యోధ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పని చేస్తోంది. రోజుమాదిరిగానే శుక్రవారం రాత్రి విధులకు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది ఒకరు అప్సర తండ్రికి సమాచారం ఇచ్చి ఆమె ఏదోలా చేస్తుందని, వెంటనే ఆస్పత్రికి వెళ్లామని చెప్పి మృతురాలి తండ్రిని తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లి చూడగా అప్పటికే అప్సర శరీరం మొత్తం చల్లబడింది. వెంటనే యాజమాన్యం హనుమకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీంతో ఆస్పత్రి యాజమాన్యం ఆమెను తన ఇంటి వద్ద దింపి వెళ్లిపోయింది. అయితే ఎలా మృతి చెందిందనే విషయంపై యాజమాన్యం చెప్పడంలో పొంతన లేకపోవడంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. ఆమె శరీర భాగంలో గాయాలై ఉన్నాయని, ఆస్పత్రిలోనే ఏదో జరిగి ఉంటుందని కన్నీరుమున్నీరయ్యారు. ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని, తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. అనంతరం ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్ సిబ్బందితో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తే నిజం తెలుస్తుందని కుటుంబీకులకు సర్దిచెప్పారు. సంబంధిత ఆసుపత్రి డాక్టర్‌తో మాట్లాడించి ఆందోళనను విరమింపజేశారు.

ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష..

మందులేని మాయరోగం ఎయిడ్స్


- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెరుగుతున్న హెచ్‌ఐవీ కేసులు
- చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్న మహమ్మారి
- ఆందోళన కలిగిస్తున్న కేసుల సంఖ్య
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం



ఎయిడ్స్.. నివారణ మార్గాలు తప్ప పూర్తిస్థాయి చికిత్స లేని వ్యాధి. అవగాహనే ఎయిడ్స్ నియంత్రణకు సరైన మందు. ముందస్తు జాగ్రత్త తీసుకోవడమే నిండు జీవితానికి శ్రీరామరక్ష. ప్రస్తుతం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ మహమ్మారి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యగా మారింది.వ్యాధి వ్యాప్తిని నిరోధించడం, చికిత్స అందించడం, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ప్రజలకు అవగాహన కలిస్తున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేసుల నమోదు తీరు ఆందోళన కలిగిస్తుంది. డిసెంబర్ 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

-సాక్షి, వరంగల్/జనగామ/నెహ్రూసెంటర్

అవగాహనే సరైన మందు..



హెచ్‌ఐవీ అని తెలియగానే సీడీ–4 కణాల సంఖ్య తగ్గేంత వరకూ అశ్రద్ధ చేయకుండా వైద్యుల పర్యవేక్షణలో ఆధునిక వైద్యసేవలు పొందితే 75 ఏళ్ల వరకు ఆరోగ్యంగా జీవనం సాగించొచ్చు. ఎయిడ్స్ రోగులూ మధుమేహం, బీపీ, ఆస్తమా రోగుల మాదిరిగానే ఔషధాల వాడకం ద్వారా మంచి ఆరోగ్యం పొందొచ్చు. హెచ్‌ఐవీ ఉన్న దంపతులు తగిన సమయంలో ఏఆర్‌టీ మందులు వాడి ఆ రోగం లేని పిల్లలకు జన్మనివ్వొచ్చు. అవగాహనే ఎయిడ్స్ నియంత్రణకు సరైన మందు. సురక్షిత లైంగిక సంపర్కం, కండోమ్‌ల వాడకం ద్వారా దీనిని అడ్డుకోవచ్చు.

ఏయే ఆహారం తీసుకోవాలి..

హెచ్‌ఐవీ బాధితులు ఉదయం 3 కిలోమీటర్లు నడవడం, 15 నిమిషాల పాటు ధ్యానం చేయాలి. గ్లాస్ పాలు, బ్రెడ్, ఉడికించిన గుడ్డు తీసుకోవాలి. రోజు రాగి జావా, అంబలి తాగాలి. మధ్యాహ్నం భోజనంలో తాజా కూరగాయలు, ఆలు దుంపలు, ఆకు కూరలు, పప్పు దినుసులు, కోడి, మేక, చేప మాసం తీసుకోవాలి. సాయంత్రం సమయంలో ఆపిల్, దానిమ్మ, అంగూర, అరటి పండ్లు, పైనాపిల్, సపోట తినాలి. గోధుమ రవ్వ పాలలో కలిపి ఉడికించి ఆరగించాలి. రాత్రి భోజనంలో తాజా కూరగాయలు, రెండు చపాతీలు, నిద్రించే సమయంలో వేడి చేసి చల్లార్చిన నీరు తాగిలి. హెచ్‌ఐవీ బాధితులు రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవడం ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవచ్చు.

తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవీ సోకే ప్రమాదం..

తల్లి గర్భంలో ఉన్న సమయంలో 5 నుంచి 10శాతం, కాన్పు సమయంలో 15 నుంచి 20 శాతం, బిడ్డకు తల్లి పాలు ఇచ్చే సమయంలో 5 నుంచి 10 శాతం వచ్చే అవకాశం ఉంటుంది.

గర్భిణులకు సైతం..

హనుమకొండ జిల్లాలో ప్రతి నెలా కొత్తగా ఐదు హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నాయి. వీరిలో ఒకరు గర్భిణీ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అయితే 2023–24లో 31,205 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయగా 86 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారించారు. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 17,218 మందికి పరీక్షలు చేస్తే 37 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు తేలింది. 9,049 మంది గర్భిణులకు పరీక్షలు చేస్తే తొమ్మిది మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. కాగా, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ.. టీబీ ఆస్పత్రికి సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని మంజూరు చేసింది.

హైరిస్క్‌లో 6,388 మంది బాధితులు..

వరంగల్ జిల్లాలో 3,498, హనుమకొండ జిల్లాలో 2,890 మంది హైరిస్క్‌లో ఉన్నారు. వరంగల్ జిల్లాలో ఫిమేల్ సెక్స్ వర్కర్లు 2,269 మంది, స్వలింగ సంపర్కులు 1,112, ట్రాన్స్ జెండర్లు 117 మంది ఉండగా, హనుమకొండ జిల్లాలో మహిళా సెక్స్ వర్కర్లు 2,103, స్వలింగ సంపర్కులు 784, ట్రాన్స్ జెండర్లు ముగ్గురు ఉన్నారు. 2001 నుంచి హెచ్ ఐవీ పరీక్షలు జరుగుతుండగా వరంగల్ లో యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) సెంటర్ లో 5,314 మంది, హనుమకొండలోని ఏఆర్‌టీ సెంటర్‌లో 5,235 మంది పేర్లు నమోదుచేసుకున్నారు. ఈ రెండు జిల్లాలో 4,585 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. అలాగే 1671 మందికి ప్రతినెల రూ.2,016 ఏఆర్‌టీ పెన్షన్ అందుతోంది.

మహబూబాబాద్ జిల్లాలో హెచ్‌ఐవీ బాధితులు..

మహబూబాబాద్ జిల్లాలో హెచ్‌ఐవీ కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. 25 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు ఈ వ్యాధికి గురవుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. రెండు సంవత్సరాలుగా కేసుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

వరంగల్ జిల్లాలో ఆరు నెలల్లో 262 మందికి...

వరంగల్ జిల్లాలో ప్రతినెలా కొత్తగా 37 హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నాయి. వీరిలో ఒకరు గర్భిణీ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అయితే 2023–24లో 31,688 మందికి పరీక్షలు చేయగా 493 మందికి హెచ్‌ఐవీ అని నిర్ధారణ అయ్యింది. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 19,900 మందికి పరీక్షలు చేస్తే 262 మందికి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. 11,120 మంది గర్భిణులకు పరీక్షలు చేస్తే ముగ్గురికి హెచ్‌ఐవీ అని నిర్ధారణ అయ్యింది.

మానుకోట జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు
2021-22,	68
2022-2023,	89
2023-2024,	102

జనగామ జిల్లాలో ..

సంవత్సరం	కేసులు
2019-20	89
2020-21	67
2021-22	59
2022-23	62
2023-24.	79

హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన వైద్య పరీక్షలు



హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య పరీక్షలు అందిస్తున్నాం. బాధితులపై ఎవరూ వివక్ష చూపించొద్దు. ఆస్పత్రికి వచ్చిన సమయంలో సర్వీసు ప్రొవైడర్లు, సామాన్య ప్రజలు వారితో స్నేహభావంతో మెలగాలి. ఎయిడ్ నిర్మూలకు పట్టణం నుంచి పల్లె వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

మల్లికార్జున్‌నరావు,డీఎంహెచ్‌ఓ, జనగామ

ఇస్రో స్పేస్ ట్యూటర్‌గా శశాంక్


శశాంక్

విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన యువ ఆర్కిటెక్ శశాంక్ భూపతిని తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక స్పేస్ ట్యూటర్‌గా ఇస్రో ఎంపిక చేసింది. శశాంక్ వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న శంకర్, శ్యామల కుమారుడు. శశాంక్ జేఎన్టీయూ నుంచి 2002లో ఆర్కిటెక్ కోర్సు పూర్తిచేశారు. ప్రస్తుతం స్పేస్ ఆర్కిటెక్చర్ సబ్జెక్టును స్పెషలైజేషన్‌గా ఎంపిక చేసుకుని పరిశోధనలు చేస్తున్నారు. 2022లో 'ఏన్షియంట్ టెక్నాలజీ డిజైన్ రీసెర్చ్ ల్యాబ్' అనే కంపెనీని స్థాపించారు. ఆ కంపెనీ ద్వారా గృహ, ఇతర నిర్మాణాల డిజైన్లు రూపొందిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాని మోదీ.. అంతరిక్ష పరిశోధనల కోసం విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకుగాను స్పేస్‌ట్యూటర్లను నియమించుకునే బాధ్యత ఇస్రోకు అప్పగించారు. శశాంక్ భూపతి ప్రాజెక్టులు నచ్చిన ఇస్రో.. ఆయనను స్పేస్‌ట్యూటర్‌గానియమిస్తూ నవంబర్ 29న ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఇస్రో సహకారంతో విద్యార్థులకు సదస్సులు నిర్వహించబోతున్నట్లు శశాంక్ భూపతి శనివారం వెల్లడించారు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

- నీటి గోలెంలో పడి చిన్నారి మృతి
- యశ్వంతాపూర్‌లో ఘటన


ఖుషి (ఫైల్)

జనగామ రూరల్: ఓ చిన్నారి ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు చేరింది. ప్రమాదవశాత్తు గోలెంలో పడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండలంలోని యశ్వంతాపూర్ లో జరిగింది. గ్రామానికి చెందిన బోట్ల ఐజాక్ రెండో కూతురు ఖుషి (3) ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గోలెంలో పడింది. నానమ్మ చూసి పక్కవారిని పిలిచి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, తల్లి కూలీకి వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా కూతురు చనిపోయిన విషయం తెలియడంతో గుండెలవిసేలా రోదించింది. నీకు అప్పుడే నిండు నూరేళ్లు నిండిపోయాయా బిడ్డా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. బిడ్డా.. ఒక్కసారి లే అంటూ కూతురు మృతదేహంపై పడి రోదించిన తీరు ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించింది.

గిరిజనుల పోరాట ఫలితమే ఫార్మాసిటీ రద్దు

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్


మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

కురవి: లగచర్ల గిరిజనుల పోరాట ఫలితంగానే ఫార్మా సిటీని ప్రభుత్వం రద్దు చేసిందని, గిరిజనులు సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా జరిగిన పోరాట విజయమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడారు. పరిశ్రమలు తీసుకురావడానికి బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదన్నారు. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ప్రజలు, రైతులను మెప్పించి 25 వేల ఎకరాల భూములు తీసుకున్నారని వెల్లడించారు. సొంత నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల భూమిని రైతులను ఒప్పించి తీసుకోలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేశారని, కలెక్టర్‌ను చంపేందుకు యత్నించారని బీఆర్‌ఎస్ నాయకులను బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఐలి నరహరి, బాదె నాగయ్య, బోడ శ్రీను, గుగులోత్ నెహ్రూనాయక్, అల్లూరి కిశోర్‌వర్మ పాల్గొన్నారు.

యూనివర్సిటీపై ప్రత్యేక దృష్టి

- అభివృద్ధి పనులు చేపట్టనున్నాం
- డిసెంబర్ 23న మరోసారి సమావేశమవుదాం
- వరంగల్ ఎంపీ కడియం కావ్య


పాలకమండలితో సమావేశమైన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, వీసీ, రిజిస్ట్రార్, ఇతర అధికారులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి కాకతీయ కాకతీయ యూనిర్సిటీలోని గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు కాకతీయ యూనివర్సిటీలో అనేక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఏయే సమస్యలున్నాయనే అంశంపై పాలకమండలితో చర్చించినట్లు తెలిపారు. సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో భూకబ్జాలకు పాల్పడినవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వం హయాంలో ఎప్పుడైనా ఎంపీలు, ఎమ్మెల్యేలు వర్సిటీకి వచ్చి సమీక్షించారా అని ప్రశ్నించారు. దీక్షా దివస్ అని బీఆర్‌ఎస్ నేతలు చేయడం శోచనీయమన్నారు. కేసీఆర్ నాడు దొంగ దీక్ష చేశారని ఆరోపించారు. సమావేశంలో కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు, కాంగ్రెస్ నాయకులు అలువాల కార్తీక్, గజ్జెల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేయాలి

కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును సమర్పించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. శనివారం వారు అకడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు, డీన్లు, ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. బోధన, బోధనేతర సిబ్బంది, మౌలిక, హాస్టల్ వసతులు, ఇతర సదుపాయాలు తెలిపారు. యూనివర్సిటీకి రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎన్ని ఉన్నాయో తెలియజేశారు. డిసెంబర్ 23న మరోసారి సమావేశం నిర్వహించి సమీక్షించుకుందామని నిర్ణయించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నట్లు ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు. అంతకుముందు కామన్‌మెస్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు సందర్శించారు. అన్నం, కూరలను పరిశీలించారు. విద్యార్థులతో కూర్చొని భోజనం చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'కంగారో'లో బామ్మ, తాతయ్యల సందడి


గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, పక్కన సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి తదితరులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని కంగారో కిడ్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటిపట్టున ఉంటూ బోరుగా ఫీలయ్యే బామ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలకు కాస్త ఆటవిడుపు దొరికింది. తమ మనుమలు.. మనుమరాళ్లతో సరదాగా గడిపారు. తోటి పెద్దలతో మాటా ముచ్చట్లు చెప్పుకున్నారు. పెద్దల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఆటలు..పాటల్లో ఉత్సాహంగా పాల్గొని కాస్త రిలాక్స్ అయ్యారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు, సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి, కిరణ్, ఉమ, శ్రీకాంత్‌రెడ్డి, స్కూల్ ఇన్‌చార్జ్ నిహారిక పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు
- జాతీయస్థాయి ఓపెన్ మెన్స్ టెన్నిస్ పోటీలు షురూ


టాస్‌వేసి క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్‌క్లబ్‌లో శనివారం జాతీయస్థాయి ఓపెన్ మెన్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ప్రారంభమైంది. ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ వేదికగా జాతీయస్థాయి టోర్నమెంట్ ద్వారా దేశం నలుమూలల నుంచి వస్తున్న క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. వరంగల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆత్మీయ స్నేహితుడు శ్రీనివాస్‌గౌడ్ స్మారకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలు ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగుతాయని, గెలుపొందిన జట్టుకు రూ.2.5 లక్షల నగదు పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ క్లబ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌కుమార్, టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్లా మురుగన్, రాజేశ్వర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, జాయింట్ సెక్రటరీ కన్నారెడ్డి, పురుషోత్తంరెడ్డి, గోపాల్‌రావు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొడుతున్నాడని హతమార్చారు..

- భర్తపై పెట్రోల్ పోసి చంపిన భార్య, ఆమె కూతురు
- శాయంపేటహవేలిలో ఘటన


సునీల్(ఫైల్)

గీసుకొండ: తమను కొట్టడమే కాకుండా పలు రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నాడనే నెపంతో ఓ వ్యక్తిని అతడి భార్య, పెంపుడు కూతురు పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేటహవేలిలో జరిగింది. మృతుడి అక్క, గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోటగిరి సునీల్ (36) 12 సంవత్సరాల క్రితం హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన మేకల లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. లక్ష్మికి కూతురు సిరి (లక్ష్మి, తన మొదటి భర్తకు జన్మించిన కూతురు) ఉండగా ఆమెను చిన్నప్పటి నుంచి తన దగ్గరే పెంచి పోషిస్తున్నాడు. సునీల్, లక్ష్మి దంపతులకు కుమారుడు జన్మించాడు. ఇదిలా ఉండగా సిరి కొద్ది రోజుల క్రితం ఓ యువకుడితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసి భార్య లక్ష్మిని, సిరిని కొట్టాడు. విషయం తెలుసుకున్న ఊరుగొండలో ఉంటున్న అతడి అక్క మేకల నీరజ, ఆమె భర్త రవీందర్‌తో పాటు మరో ఇద్దరు శుక్రవారం శాయంపేటకు వెళ్లి సునీల్‌ను సముదాయించి ఆదివారం మాట్లాడదామని సర్ది చెప్పి వెళ్లారు. అదే రోజు రాత్రి సునీల్ భార్య లక్ష్మి, ఆమె కూతురు సిరి అతడిపై పెట్రోల్‌పోసి నిప్పంటించి ఇంటి తలుపులు పెట్టారు. సునీల్ కేకలు విన్న ఇరుగుపొరుగు వారు వచ్చి తలుపులు తెరిచి వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కాగా, తన తమ్ముడి మృతికి కారణమైన అతడి భార్య లక్ష్మి, కూతురు సిరిపై చర్యలు తీసుకోవాలని మృతుడి అక్క మేకల నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. కాగా, ఘటనా స్థలిని మామునూరు ఏసీపీ తిరుపతి, గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పరిశీలించారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక
- ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలు


మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక

నయీంనగర్: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైందని, రాజ్యాంగ పరిరక్షణ అందరి సమిష్టి బాధ్యతని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. శనివారం హనుమకొండ హరిత హోటల్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలు ప్రారంభమయ్యాయి. తొలుత మహాసభల ప్రాంగంణలో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు ఐఏఎల్ పతాకావిష్కరణ చేశారు. రాష్ట్ర మహాసభలకు ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక హాజరయ్యారు. ఈ సందర్భంగా 'భారత రాజ్యాంగం, ఉద్దేశాలు' అనే అంశంపై జస్టిస్ నగేశ్ భీమపాక మాట్లాడారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సిద్ధించాయన్నారు. ఎంతో మంది మహానుభావులు దేశాన్ని, రాజ్యాంగాన్ని ముందుకు నడిపించారన్నారు. రాజ్యాంగం 75 ఏళ్లు గడిచినా పటిష్టంగా ఉందన్నారు. రాజ్యాంగం అములు లో కొన్ని వైఫల్యాలు ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజల హక్కులను కాపాడుతోందన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నరసింహా రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఐఏఎల్ ప్రతిష్టాత్మక సంస్థ అని, ఎంతోమంది పోరాటాల ఫలితంగా ఏర్పడిందన్నారు. ఈ మహాసభల్లో న్యాయవాదుల సమస్యలపై చర్చించి తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి బార్ కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురళీధర, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్, ఐఏఎల్ నాయకులు ఏపీ. కృష్ణారావు, బొమ్మగాని శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్, బీమనాథం శ్రీనివాస్, కేవీఎల్, హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రమేశ్‌బాబు, జీవన్ గౌడ్, నాయకులు ఎం.ఆదిరెడ్డి, జయ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.